www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 ఫిబ్రవరి 2023

మాట్లాడుతున్న డిఇఒ రాఘవరెడ్డి

విద్యార్థుల పురోగతిలో
తల్లిదండ్రుల పాత్ర కీలకం
- జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థుల పురోగతిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని డిఇఒ రాఘవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నేతాజీ సర్కిల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కొండూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిఇఒ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను ఇంటిదగ్గర కనీసం నాలుగు గంటల పాటు చదివించడానికి ప్రతి తల్లీ తండ్రీ కృషి చేయాలని సూచించారు. ఇంటిలో పెంచుకునే మొక్కల ఎదుగుదల కోసం ఎంతో ప్రయత్నించే మనం మన బిడ్డల విద్యా ప్రమాణాల పెంపునకు కనీస ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. విద్యావంతులు కాకపోయినప్పటికీ మీ పిల్లలను ముందు కూర్చోబెట్టుకుని చదివే విధంగా ప్రోత్సహించాలన్నారు. పదో తరగతి మార్కులతో భవిష్యత్తులో అనేక రకాల ఉద్యోగ అవకాశాలు ఉన్నందున మీ బిడ్డలు అత్యధిక మార్కులు పొంది ఉన్నత స్థాయికి చేరడానికి మీ వంతు కృషి ప్రధానమైందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలకు విధిగా సరైన సమయానికే విద్యార్థులను పంపాలని, వారానికోసారి పాఠశాలకు వచ్చి వారి వారి పిల్లల హాజరు మార్కులను తల్లిదండ్రులు పరిశీలించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు చదువుకోవడానికి, మెరుగైన ఫలితాలు పొందడానికి అనేక రకాల వసతులను కల్పిస్తోందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్ మాట్లాడుతూ విద్యార్థులను గాడిలో పెట్టే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేననీ తల్లిదండ్రులు సహృదయంతో ఉపాధ్యాయులకు సహకరించాలని సూచించారు. **పాఠశాలకు మైక్ సెట్ వితరణ**.. రాయచోటి ప్రాంతానికి చెందిన ప్రముఖ వైసిపి నాయకుడు కోడి శ్రీనివాసులు రెడ్డి రూ. 25 వేలు విలువ చేసే మైక్ సెట్‌ను పాఠశాలకు విరాళంగా అందించారు. పాఠశాలకు ఇంకా ఏవైనా మౌలిక వసతులు అవసరమైతే దగ్గరుండి ఏర్పాటు చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు, మున్సిపల్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, పాఠశాల సిబ్బంది వీరిని ఘనంగా సన్మానించారు.

గంగమ్మ జాతరకు గట్టి బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లి

ఈ నెల 21,22 తేదీలలో నిర్వహించబోయే గంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం గంగమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలించారు. ఆర్‌టిసి బస్సులు, డిపో ఏర్పాటు, వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు రాయచోటి, పులివెందుల, కడప డిపోల నుంచి జాతరకు వచ్చే బస్సుల రూట్ మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. జాతరలో మద్యం విక్రయించిన కఠిన చర్యలు తప్పవని అన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు రెండు రోజులపాటు నిర్వహించే జాతరలో అశ్లీల నృత్య ప్రదర్శనలు చేయరాదని సూచించారు. చాందిని బండ్లతో వచ్చే భక్తులకు అశ్లీల నృత్య జాతరలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట సిఐ వరప్రసాద్, ఎస్‌ఐ వినోద్‌కుమార్, ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, కార్యనిర్వహణ అధికారి రవీంద్రరాజు, నలంద స్కూల్ కరస్పాండెంట్ బాలసుబ్రమణ్యం , హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్ పాల్గొన్నారు

సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

రెండేళ్లల్లో 'ఉక్కు' సాకారం

- 75 శాతం స్థానికులకే ఉద్యోగాలు
- రూ.700 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటా
- ఉక్కు పరిశ్రమ భూమిపూజలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ జమ్మలమడుగు రూరల్

రాబోయే రెండేళ్లల్లో జిల్లా వాసుల ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కల సాకారం అవుతుందని ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11.10 గంటల సమయంలో కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లిలో రూ.3,300 కోట్లతో మొదటిదశ ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులను జెఎస్‌డబ్ల్యు గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌తో కలిసి చేసిన భూమిపూజ కార్యక్రమంలో ప్రసం గించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి దశ నిర్మాణ పనుల్ని 24 నెలల్లో పూర్తి చేస్తామని, రూ.5000 కోట్లతో రెండవ దశ పనుల్ని ఐదేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. కర్నాటక రాష్ట్రంలోని విజయనగర తరహాలో కడప జిల్లా మహా నగరంగా రూపాంతరం చెందుతుందని ధీమాను వ్యక్తం చేశారు. దేశంలోనే జెఎస్‌డబ్ల్యు గ్రూప్ 1.70 లక్షల కోట్ల పెట్టుబడులతో 28 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో అగ్రగామిగా నిలిచిందని, ఇటువంటి కంపెనీ చేతిలో కడప జిల్లాలోని ఉక్కు పరిశ్రమను పెట్టామని చెప్పారు. కీ.శే వైఎస్‌ఆర్ తన హయాంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి జిల్లా రూపురేఖలు మార్చాలని కలలు గన్నా రని, ఆయన మరణానంతరం అధికారంలోకి వచ్చిన పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఆయన బిడ్డ ముఖ్యమంత్రి కావడంతో ఒక్కొక్కటిగా మంచిరోజులు వస్తున్నాయన్నారు. రూ.700 కోట్లతో స్టీల్ ప్లాంట్‌తోపాటు, ఆగ్జిలరీ, ఎకోసిస్టమ్, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల కల్పిస్తామన్నారు. 67వ జాతీయ రహదారి 7.5 కి.మీ మేర నాలుగు వరుసల రహదారి అనుసంధానం, ప్రొద్దుటూరు-యర్రగుంట్ల 10 కి.మీ మేర రైల్వేలైన్, గండి కోట జలాశయం నుంచి నీటి సరఫరా, తలమంచిపట్నం నుంచి 22కెవి విద్యుత్ సదుపాయం కల్పించాల్సి ఉందన్నారు. దీంతోపాటు కొప్పర్తి పారి శ్రామికవాడలో ఇఎంసిలో 550 ఎకరాల్లో 10 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయన్నారు. ఫలితంగా లక్ష మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. జగనన్న ఇండస్ట్రియల్ హబ్‌లో రూ.1100 కోట్ల పెట్టుబడులతో 11,500 మందికి ఉపాధి అవకాశాలు అందుబాటు లోకి వస్తాయని చెప్పారు. ఇందుకుగానూ 155 ఎకరాల్లో హబ్ అడుగులు వేస్తోందన్నారు. ఫలితంగా 18 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, తత్ఫలితంగా 1.75 లక్షల ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల కోసం విదేశాలు, ఇతర ప్రాం తాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పి స్తామన్నారు. ఇందుకు సంబంధించి 75 శాతం స్థానికులకు ఉద్యోగాల కల్పనకు సంబంధించి చట్టాన్ని తెచ్చామని గుర్తు చేశారు. అనంతరం జిందాల్ గురించి ప్రస్తావిస్తూ ఇక్కడికి మీరొక్కరే వచ్చారని కాదు, గ్రీన్ హైడ్రోజన్, సోలార్‌ప్లాంట్, ఇతర ఆగ్జిలరీ యూనిట్ల ఏర్పాటును దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామని తెలిపారు. మీకేమైనా సమస్యలు ఎదురైతే ఒక్క ఫోన్ కాల్ చేయాలని, అండగా నిలుస్తామని హామీనిచ్చారు. ఈజ్ ఆఫ్ డూయింగ్, పారిశ్రామిక ర్యాంకింగ్‌లోనూ ముం దంజలో ఉన్నాయని తెలిపారు. 2021 -22లో 11.43 శాతం జిడిపితో దేశంలోనే అగ్రగామిగా నిలిచామన్నా రు. అనంతరం పులివెందుల ఫంక్షన్ అనంతరం విజయ వాడకు వెళ్లి పోయారు. అంతకుముందు పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి విజృంభణ కారణంగా 2019 నుంచి ప్రపంచమంతా స్తంభించిపోవడంతో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయ డంలో ఆలస్యమైందన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా రూపురేఖలు మారిపోతాయని తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే వెనుకబడిన రాయల సీమకు ఏదైనా చేయాలనే ఉద్దేశంతో కీ.శే వైఎస్‌ఆర్ శ్రీకారం చుట్టారని, ఆయన మరణానంతరం అసంపూర్తిగా నిలిచిపోయిందని చెప్పారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎష్ జగన్‌కు పులివెందుల తర్వాత జమ్మలమడుగు చిరునామాగా మారడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాను పరి శ్రమల ఖిల్లాగా మార్చుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం అం జా ద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జడ్పీ ఛైర్మన్ ఆకే పాటి అమరనాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబు, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న సిఎం జగన్

క్రీడాకారినికి ట్రోఫీ అందజేస్తున్న కరెస్పాండంట్ ఈశ్వరయ్య

శ్రీ సాయి నారాయణ విద్యార్థినికి స్వర్ణ పతకం

ప్రజాశక్తి - రాజంపేట అర్బన్

స్థానిక సాయి నగర్‌లోని శ్రీ సాయి నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న వర్ల జాహ్నవి ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సౌత్ జోన్ జాతీ యస్థాయి తేక్వాండో పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కర స్పాండెంట్ నీలి ఈశ్వరయ్య ఆమెను అభినందించారు. ముందుగా క్రీడాకారిని జాహ్నవి తల్లిదండ్రులు వర్ల రాజేశ్వరి, నరసింహులు ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జాహ్నవికి ట్రోఫీతో పాటు జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఆమెకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ సునీల్‌కు ప్రత్యక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యా ర్థులు చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలని తెలిపారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యం, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసంతో పాటు మానసిక వికాసం కూడా లభిస్తుందని చెప్పారు. నేటి సమాజంలో విద్యార్థినీలు మార్షల్ ఆర్ట్స్ వంటి ఆత్మ రక్షణ విద్యలు నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉందన్నారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ శివ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

రాయచోటి : జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహారంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ పీడీ యం.ధనలక్ష్మి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 2275 అంగన్వాడీ కేంద్రాలున్నాయని చెప్పారు. వీటి పరిధిలోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందచేస్తున్నారని చెప్పారు. గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలలోనే మధ్యాహ్న భోజనం చేసేవిధంగా అన్ని వసతులు కల్పించాలన్నారు. గర్భిణీలు, బాలింతలకు రోజూ క్రమం తప్పకుండా మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందజేస్తున్నామని ఇందులో ఎటువంటి నాణ్యతాలోపం ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. పౌష్ఠికాహారం నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదని చెప్పారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలను తరచూ సందర్శిస్తామని టీచర్లు, కార్యకర్తలు, ఇతర సిబ్బంది సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. ఇక నుంచి పౌస్టికాహారం సక్రమంగా పంపిణీ చేయకపోయినా సిబ్బంది సమయ పాలన పాటించక పోయినా వెంటనే ప్రాంత ప్రజలు తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రలోభాలకు గురిచేస్తే సహించేది లేదు

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయులను ప్రలోభాలకు గురిచేస్తే సహించేది లేదని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి బండ్లపల్లి మదన్ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి ఒక అధికారిగా ఉండి ఉపాధ్యాయుల మీద గౌరవం లేకుండా లంచ్, టిఫిన్ బాక్సులు, డిన్నర్లతో ప్రలోభాలకు లొంగదీసుకోవాలనే కార్యక్రమాలు చేపట్టడం చాలా దారుణమని అన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన అరియర్స్, జిపిఎఫ్, మెచ్యూరిటీ ఇన్సురెన్స్ తదితర సమస్యలు తీర్చకుండా ఓటు అడగడం సిగ్గు చేటని వాపోయారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వినయ్ కుమార్ పాల్గొన్నారు.

రెగ్యులర్ పీడీని నియమించాలి

పౌష్టికాహారం సకాలంలో పంపిణీ చేయాలి
అర్హులైన ఆయాలకు ఉద్యోగోన్నతలు కల్పించాలి
సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలో ఐసిడిఎస్ డిపార్ట్‌మెంట్‌కు రెగ్యులర్ పీడీని నియమించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి.హెచ్. చంద్రశేఖర్, ఎ. రామాంజులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు 50 గ్రాముల కోడిగుడ్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ నిబంధనలున్నా 30 నుండి 35 గ్రాముల పరిమాణంలో ఉన్న గుడ్లను గుత్తదారుడు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంటిఆర్‌ఫుడ్‌లో చక్కెర లేకుండా వస్తుందని చెప్పారు. వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు రెగ్యులర్‌గా అంగన్వాడీ కేంద్రాలకు చేరలేదని వాపోయారు. గతంలో నాణ్యమైన పాల డబ్బా ఇచ్చేవారని, ఇప్పుడు ఇస్తున్న ప్యాకెట్ పాలు రుచిగా ఉండడం లేదని పలువురు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. దేవపట్ల , శెట్టిపల్లి సెక్టార్ల అంగన్వాడీ వర్కర్లకు, ఆయాలకు అక్టోబర్ జీతం, రాలేదని దీనిపై విచారణ చేపట్టి కారకులైన వారి మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అర్హులైన ఆయాలకు ఉద్యోగోన్నతులు కల్పించాల్సి వస్తుందని వారిపై రకరకాల ఆరోపణలు చేయడం అధికారులకు తగదని పేర్కొన్నారు. . నాణ్యమైన పౌష్టికాహారం పాలు గుడ్లు పంపిణీ చేసే కాంట్రాక్టర్ల ను బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రాజంపేట కార్యకర్తలకు 14 నెలల జీతం ఇవ్వాలని, మరో 28 మందికి రెండు, మూడు నెలలజీతం పెండింగ్ ఉందని, పెండింగ్ జీతం ఇచ్చే వరకూ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. చిన్న చిన్న కారణాలు చూపి అంగన్వాడీలను మానసిక ఇబ్బందులు గురిచేస్తే సహించేది లేదన్నారు. నల్లగుట్టపల్లి అంగన్వాడీ వర్కర్ పూర్ణకుమారిపై తప్పుడు నివేదికలు తయారుచేసి తొలగించాలని చూస్తున్నారని కలెక్టర్ తక్షణం రాజకీయ వేధింపుల మీద జోక్యం చేసుకోవాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

జాతీయ జల అవార్డు రేసులో సంబేపల్లి హైస్కూల్

పాఠశాలను సందర్శించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - రాయచోటి

అత్యంత ప్రతిష్టాత్మకమైన 4వ జాతీయ జల అవార్డు (నేషనల్ వాటర్ అవార్డ్స్) రేసులో సంబేపల్లి హైస్కూల్ ఉంది. ప్రతి సంవత్సరమూ దేశవ్యాప్తంగా జలసంరక్షణలో ఉత్తమ విధానాలు ప్రదర్శించే మూడు పాఠశాలలకు కేంద్ర జల మంత్రిత్వశాఖ జాతీయ జల అవార్డును ఇస్తుంది. ఇందులో భాగంగా సంబేపల్లి పాఠశాల గత సంవత్సరం అక్టోబర్‌లో నామినేట్ అయింది. ఇందులో భాగంగా హైస్కూల్‌ను బుధవారం కేంద్ర బృందం సందర్శించింది. బృందంలో సెంట్రల్ వాటర్ కమిషనర్ సభ్యులతోపాటు నేషనల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సభ్యులున్నారు. బృందానికి నేతృత్వం వహించిన సెంట్రల్ వాటర్ కమిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ నందిని, జ్ఞానేశ్వర్‌రావు మాట్లాడుతూ జల సంరక్షణ కోసం పాఠశాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలించామన్నారు. వాన నీటిని భూమిలోకి ఇంకించేందుకు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను పరిశీలించామని తెలిపారు. ఉపాధి హామీ ఆధ్వర్యంలో నాటిని 3 వేల మొక్కలను వాటి సంరక్షణ కోసం తీసుకున్న చర్యలు, తక్కువ నీటి సరఫరా కోసం అమర్చిన డ్రిప్ పైపులను పరిశీలించినట్లు చెప్పారు. తక్కువ నీటిని గ్రహించే మొక్కలు పాఠశాలలో ఉండడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సభ్యులు అనంతరావు, హెచ్‌ఎం మడితాటి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ మార్ల ఓబుల్ రెడ్డి, విశ్రాంత ఎంఇఒ రామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంబేపల్లె హైస్కూల్‌లో కేంద్ర బృందం

పొలంబడితో అధిక ప్రయోజనాలు

ప్రజాశక్తి-పీలేరు

పొలంబడితో రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి యు. ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని బోడు ముల్లువారిపల్లె పంచాయితీ, మొరవ వడ్డిపల్లిలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలంబడి ప్రయోజనాలు, ఈ-పంట, పిఎం కిసాన్, ఇకెవైసి వల్ల లాభాలను రైతులకు తెలియజేశారు. ఆర్‌బికె సిబ్బంది పొలంలో దీర్ఘ, స్వల్ప కాలిక ప్రయోగాల గురించి తెలియజేశారు. పొలంబడిలో పొలం పరిసరాల విశ్లేషణలో భాగంగా చార్ట్స్ తయారు చేసి, రైతులకు పొలంలోని శత్రు పురుగులు, మిత్ర పురుగులు, కలుపు మొక్కలు వంటి అంశాల గురించి తెలియజేశారు. కార్యక్రమానికి జిల్లా సహాయ వ్యవసాయ అధికారి టి. సావిత్రి, జిల్లా అధికారి షణ్ముగం, పీలేరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వైవి రమణ రావు, మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి, ఎఇఒలు నజీర్ అహ్మద్, ఇంద్రసేనా రెడ్డి, అల్తాఫ్, ఆర్.బి.కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొలంబడి పనులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

యువగళం పాదయాత్రలో 'మండిపల్లి'

ప్రజాశక్తి రాయచోటి

నారా లోకేష్ బాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం సత్తివీడు నియోజకవర్గం, పిచ్చాటూరులో కొనసా గుతున్న సందర్భంగా రాయ చోటి టిడిపి నియోజకవర్గ నాయ కులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెళ్లి కలిశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు ను కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం రాయచోటిలో పలు సమస్యలు కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించినట్లు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో నారా లోకేష్ బాబు వస్తున్న అనుహ్య స్పందనను చూసి ఓర్వలేక ఈ ప్రభుత్వం ఆయనను అడుగడుగునా ఇబ్బందులు పెడుతోందని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు సృష్టించినా పాదయాత్రను అడ్డుకోలేరన్నారు. రాబోయే కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పుకొచ్చారు. దీనికోసం టిడిపి నాయకులు, కార్యకర్తలు, కష్టపడి పనిచేసి తెలుగుదేశం పార్టీని గెలిపించి తిరిగి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవాలి అన్నారు.

పాదయాత్రలో లోకేష్‌ను కలిసిన మండిపల్లి రాంప్రసాద్

అరాచక పాలనతో రాష్ట్రం అధోగతి : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

జగన్ రెడ్డి అరాచక పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి మున్సిపాలిటీలోని 16 వార్డులో టిడిపి ఆధ్వర్యంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ, రచ్చబండ కార్యక్రమాలను, నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి వార్డులో పర్యటిస్తూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొనసాగుతున్న అవినీతి అరాచక పాలన ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని, టిడిపి నేతలపై దాడులు, అక్రమ కేసులు ఎక్కువయ్యాయని వాపోయారు. మహిళలపై అఘాయిత్యాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు అసంఘటిత, విద్యుత్, భవన నిర్మాణ కార్మికులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పనిభారంతో అల్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతల మయంగా తయార య్యాయని, మున్సిపాలిటీల్లో సిమెంటు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. ఏడాది కందట వచ్చిన వరదల్లో అన్నమయ్య, పింఛ ప్రాజెక్టులు తెగిపోతే సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికీ వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర వ్యవస్థ గాడిన పడాలంటే రాబోయే 2024 ఎన్నికల్లో తప్పనిసరిగా చంద్రబాబు సీఎం కావాలని పేర్కొన్నారు. కార్యక్ర మంలో పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్‌వలి ,రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, రాజంపేట పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి వతన్ నిస్సార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఎస్.కె హుస్సేన్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, టిడిపి నేతలు మైనుద్దీన్, మాజీ కౌన్సిలర్ మహబూబ్‌బాష , పట్టణ తెలుగు యువత అధ్యక్షులు ఇనముల్లా ,అత్తర్ జావిద్, శేషి జాబీర్, సోనిరాజ్ కలీమ్, ఇలియాజ్, సర్దార్ వలి ఖాన్ , సయ్యద్ ఫజిల్ , జావిద్ , ఉమర్ ఫరూక్ , జిలాన్ బాష, బసయ్య, మహబూబ్ బాష, హాజీ, మన్సూర్, మతీన్, శివారెడ్డి, దుర్గ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఇఒ మంజుల

శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని తవళం గ్రామంలోని యోగ నేలమల్లేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 18, 19వ తేదీలలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆలయ ఇఒ మంజుల, శివరాత్రి పండుగ పర్యవేక్షణ అధికారి రవికుమార్‌లుపేర్కొన్నారు. బుధవారం ఆలయం వద్ద తహశీల్దార్ సిఆర్.మంజుల, ఎంపిడిఒ లీలా మాధవి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జ్ ఆర్ఐ రమణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం రాత్రి శివపార్వతుల కళ్యాణం, నాట్య ప్రదర్శన ఉన్నందున భక్తులు జాగారం చేస్తారని అన్నారు. స్వామి వారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఆలయం వద్ద భద్రత ఏర్పాట్లను సిద్ధం చేశామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మదనపల్లి ఆర్‌టిసి రెండవ డిపో వారు మదనపల్లి, నిమ్మనపల్లి, తవళం నుండి ఆలయం వద్దకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ఆలయం వద్దకు ప్రయివేట్ ఆటోలను నిషేధించినట్లు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, గంగాధర, రవి, శంకర, రవీంద్ర, నారాయణ, హెడ్ కానిస్టేబుల్ నవయుగనాథ్, పంచాయతీ కార్యదర్శి మారెప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తహశీల్దార్ ధనుంజయులు పేర్కొన్నారు. మండలంలోని బీరంగి పంచాయతీ, గూగుటికోన, బండెన్నస్వామి ఆలయంలో శివరాత్రి పండుగపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ బొజ్జ నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. విఆర్‌ఒ వెంకటేష్, సచివాలయం సెక్రటరీ, హెల్త్ ఆఫీసర్, మహిళా పోలీసులకు సూచనలిస్తూ శివరాత్రికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలని అన్నారు. నియోజకవర్గంలో మల్లయ్యకొండ తర్వాత ప్రసిద్ధి గాంచిన దేవాలయం బండన్న స్వామి ఆలయమని తెలిపారు. ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి గూగుటికోన ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఇక్కడ పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. **గాలివీడు :** శివరాత్రి పండుగకు మండలంలోని శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. ఎగువగొట్టివీడులోని రామలింగేశ్వర ఆలయం, గండిమడుగులోని ఉమా ్రహేశ్వరాలయం, తుమూకుంటలోని పెద్దగొడుగు నోముల బ్రహ్మేంద్ర స్వామివారి ఆలయాలను ఇప్పటికే విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

ప్రతిభ చాటిన శ్రీసాయి కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు యూనివర్సిటీ విడుదల చేసిన మొదటి సెమిస్టర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో టి. మనోజ్ కుమార్ 83.3శాతంతో మొదటి ర్యాంకు, కె.లహరి 79.7శాతంతో రెండవ ర్యాంకు, ఎస్.ఫిర్దోస్ 79.5 శాతంతో మూడవ ర్యాంకు సాధించారని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగము నుంచి సయ్యద్ అస్రా 83.3 శాతంతో మొదటి ర్యాంకు, ఎన్.ఉదయశ్రీ 83.6 శాతంతో రెండవ ర్యాంకు, కె.అర్చన 82.13 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందించారు. ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.కార్తికేయన్, అధ్యాపకులు అభినందించారు.

నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులతో సిఐటియు నాయకులు

వ్య.కా.స గ్రామ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలం పరిధిలోని గోవిందంపల్లెలో వ్యవసాయకార్మిక సంఘం నూతన గ్రామ కమిటీ ఎర్పాటు చేసినట్లు వ్య.కా.స జిల్లా అధ్యక్షులు ఎం.జయరామయ్య తెలిపారు. అధ్యక్షులుగా జె.శారద, కార్యదర్శిగా జె.రాజమ్మను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జయరామయ్య మాట్లాడుతూ గోవిందంపల్లె లో సర్వే నెంబర్ 480బి భూమి 20సంవత్సరాలు దళితుల అనుభవంలో ఉందని తెలిపారు. 8వ విడత అసైన్మెంట్ కమిటీలో వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండలం కార్యదర్శి వెంకటరమణ, దార్లసుధాకర్, కెవిపిఎస్ నాయకులు నాగిపోగు పెంచలయ్య, వ్యవసాయ కార్మికులు పాల్గొనారు.

IN THE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE, KADAPA.

I.A. NO. 104/2022

H.M.O.P.NO. 93/2021

Guddeti Karthik Kumar Reddy.

...Petitioner

Vs

Araveti Praveena, W/o G.Karthik Kumar Reddy, D/o A.Mal Reddy, Working in Sachivalayam at Rayachoty. D.No. 7/309, Gurralametta, Kadiri Road, Galiveedu Town, Kadapa Dist.

...Respodent

నోటీసు

పై నెంబరులో పిటిషనరు, రెస్పాండెంటు పైన Divorce కోరుచు పిటిషన్ దాఖలు చేసి వున్నాడు. రెస్పాండెంటు నోటీసుకు గాను 2.3.2023 తేదీన వాయిదా వున్నది. రెస్పాండెంట్‌కు ఆక్షేపణలున్న యెడల పై కోర్టులో ఉదయం గం.10.30లకు వాయిదాకు హాజరయి తెలుపుకొనవచ్చును. లేనంతట పరోక్షములో ఎక్సుపార్టీగా తీర్మానించబడును.

పి.ప్రతాప్‌రెడ్డి

పిటిషనరు అడ్వకేట్, కడప.

మంత్రి రోజాకు తవ్వా రచనలు అందజేత

చాపాడు : పర్యాటక శాఖ మంత్రి రోజాకు డాక్టర్ తవ్వా వెంకటయ్య తను రచించిన రాయలసీమ తొలి తరం కథలు, ఇతర పుస్తకాలను విజయ వాడలోని అమె స్వగృహంలో బుధవారం అందజేశారు. రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడిగా ఆయన మంత్రి రోజాను కలిశారు. కార్యక్రమంలో అధికార భాషా సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ మస్తానమ్మ, కత్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన ఎంఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అణసముద్రం పుత్తనవారిపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఇఒ రంగనాథయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలను, మరుగుదొడ్లను చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత గురించి ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేశారు. నాడు-నేడు పనుల స్థితి గతుల గురించి అధ్యయనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని తెలిపారు. బియ్యం, గుడ్లు తదితర వాటి గురించి ప్రధానోపాధ్యాయులును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం భోజనం అందించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తెస్తే ఉన్నతాధికారులకు తెలిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రత్యేకంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఇఒ రంగనాథయ్య

వంట చాలా బాగుందని వంట ఏజెన్సీని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలిగల్లు నుంచి కాలువలకు నీరు విడుదల

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు రిజర్వాయర్ నుంచి ఎడమ కాలువకు ఆరు కిలోమీటర్లకు కుడికాలువకు 21వ కిలోమీటర్ల వరకు నీటిని విడుదల చేస్తున్నట్లు వెలిగల్లు ప్రాజెక్టు డిఇ జనార్ధన పేర్కొన్నారు. గత నెల 21 నుంచి నీటిని అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఎడమకాలువకు నాలుగు క్యూసెక్కులు, కుడి కాలువకు 60 క్యూసెక్కులు నీరు అందించినట్లు ఆయన తెలిపారు.

కుడికాలువ ద్వారా వెళుతున్న నీరు

పాఠశాలకు విలువైన వస్తువులు వితరణ

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు రూ.10 లక్షలు విలువ చేసే వస్తువులను బెంగళూరుకు చెందిన అపోటెక్స్ ఆధ్వర్యంలో అందించారు. 1983 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థుల సహకారంతో ల్యాబ్ ఆరో ప్లాంట్, హ్యాండ్ వాష్ యూనిట్లు, ఫర్నిచర్, కంప్యూటర్, హైజిన్ స్కిట్ ఇలా వస్తువులను అందజేశారు. విద్యార్థులకు విలువైన వస్తువులకు అందించి నందుకు ప్రధానోపాధ్యాయులు నిర్మల ఆనందం వ్యక్తం చేశారు. అపోటెక్స్ డైరెక్టర్ యోగాంజనేయరెడ్డి, డాక్టర్.గౌతమ్ పూజారి రాజేష్ కృష్ణన్, పద్మజలను ఘనంగా సన్మానించారు.

కరాటేలో విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నేషనల్ లెవెల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్-2023, బెంగళూరు ఓపెన్ కప్ వెయిట్ కేటగిరి అండర్ 14-15 ఏళ్ళు వయిస్సు విభాగం కథా కుమ్మితేలో మదనపల్లి విజయభారతి హైస్కూల్లో 9వ తరగతి విద్యార్థి పునీత్ కుమార్ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం మదనపల్లిలోని విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్ సేతు చేతుల మీదుగా గోల్డ్ మెడల్, ట్రోఫీ సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కరాటే విద్య నేర్చుకోవడం వలన క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత, శారీరకంగా దృఢత్వం, మంచి ఆరోగ్యం తదితర ఉపయోగాలు చేకూరు తాయని సూచించారు. తనను తాను కాపాడుకోవడానికి బాల బాలికలకు యుద్ధ విద్య కరాటే చాలా ఉపయోగ పడుతుందన్నారు. పునీత్ కుమార్ కరాటేలో మరిన్ని పతకాలు సాధించి తమ పాఠశాలకు, రాష్ట్రానికి మంచి పేరుని తీసుకురావడంతో పాటు త్వరలో జరిగే పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

శివరాత్రికి ఆర్‌టిసి స్పెషల్ బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహాశివ రాత్రి పండుగకు ఆర్‌టిసి స్పెషల్ సర్వీసులు నడపటంతో పాటు ప్రయాణికుల సేవలు, సౌకర్యాలపైన ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ స్పష్టం చేశారు. బుధవారం మదనపల్లి ఆర్‌టిసి డిపోలో ఒకటి, రెండు డిపో మేనేజర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శివ రాత్రి పండుగకు భక్తుల సౌకర్యార్థం రద్దీని దృష్టిలో ఉంచుకొని స్పెషల్ సర్వీసులు నడుపునున్నామని తెలిపారు. మదనపల్లి నుండి తలకోన, మల్లయ్య కొండ, తవళం, ఝురితో పాటు మరిన్ని ప్రదేశాలకు 159 స్పెషల్ సర్వీసులు గత సంవత్సరం ఛార్జీలకే నడపడం జరుగుతుందని, ప్రయాణికులు ఆర్‌టిసి సేవలను సద్వినియోగం చేసుకుని, సంస్థను ఆదరించాలని కోరారు. సమావేశంలో ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ వెంకట రమణ రెడ్డి, టూ డిపో మేనేజర్ నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైతే దేశానికి వెన్నెముకని వారు లేని ప్రపంచాన్ని ఊహించలేమని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్ఎస్ రోడ్డులో గల శ్రీ చైతన్య పాఠశాలలో ఎజిఎం రమణయ్య ఆధ్వర్యంలో సశ్యభారత్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. గడ్డి, వరి గింజలు చేతబట్టి రైతుల్లా వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రైతుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. వ్యవసాయ పారదర్శకత, విలువలను విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ వెంకటసుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ అనూష, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ కస్తూరి, స్మార్ట్ లివింగ్ ఇన్‌ఛార్జ శివసాయి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎఒ నాగేంద్రప్రసాద్

చిరుధాన్యాల విలువను గుర్తించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చిరుధాన్యాల విలువను గుర్తించి పండించాలని మండల వ్యవసాయ అధికారి జి.నాగప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని కోటవారిపల్లె గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల్లో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంతమైన పంటను పండించవచ్చునని తెలిపారు. ఈ సంవత్సరాన్ని ప్రభుత్వం చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని, ప్రతి రైతు చిరు ధాన్యాల విలువను పండించాలని కోరారు.

పంచరంగుల చిత్రపటాల అందజేత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రానున్న అంతర్జాతీయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మదనపల్లి శాఖ గ్రంథాలయానికి ప్రసిద్ధ సాహితీమూర్తుల పంచరంగుల చిత్రపటాలను ఆజ్ బహల్ ట్రస్ట్ చైర్మన్, అడ్వకేట్ ఎం.ఎ.బాషా, శాఖ గ్రంథాలయ అధికారిని ఆర్.వసంత కుమారికి అందజేశారు. బుధవారం జరిగిన కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు, ప్రతి కళాశాలకు సాహిత్య వేత్తలను చిత్రపటాలను అందజేస్తామని తెలిపారు. లైబ్రేరియన్ వసంత్ కుమారి ఎంఎ భాషాకు, రచయితలకు, పాఠకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

డిజిపిని కోరిన ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

నియోజకవర్గ కేంద్రమైన పీలేరులో ట్రాఫిక్ పెరిగిన దృష్ట్యా నూతనంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం అమరావతిలో డిజిపి కార్యాలయంలో డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకొని, నియోజక వర్గంలోని సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురంలో సర్కిల్ కార్యాలయ భవనానికి స్థల సేకరణ పూర్తి చేయడం జరిగిందని, నిధులు మంజూరు చేసి నూతన సర్కిల్ కార్యాలయానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పలు మండలాల్లో కాలం చెల్లిన వాహనాలతో పోలీస్ సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారని, వాటి స్థానంలో కొత్త వాహనాలను మంజూరు చేయాలన్నారు. డిజిపికి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

డిజిపికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే

సంఘ సభ్యులతో మాట్లాడుతున్న ఎపిఎం ఖాదర్‌వలి

రుణాలు సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

సంఘ సభ్యులు రుణాలు సక్రమంగా చెల్లించాలని వెలుగు ఎపిఎం ఖాదర్‌వలి కోరారు. బుధవారం పెద్దివీడు గ్రామ సమాఖ్య రెండవ కార్యవర్గ సమావేశం గ్రందేవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ రుణాలు సక్రమంగా చెల్లించడం వల్ల ప్రభుత్వ వడ్డీ రాయితీ అలాగే పెద్ద మొత్తంలో రుణాలు పొందడానికి అర్హత ఉంటుందని అన్నారు. రుణాల ద్వారా మంచి జీవనోపాధి ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సమావేశాల్లో అన్ని రకాల లావాదేవీలు నిర్వహించడం మంచిదన్నారు. కార్యక్రమంలో సిసి క్రిష్ణయ్య, సమాఖ్య అధ్యక్షురాలు సుప్రజ, విఒఎ శ్రీదేవి సభ్యులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు అందిస్తున్న వీరనాగిరెడ్డి

పౌష్టికాహారంతో క్షయ వ్యాధి నివారణ

ప్రజాశక్తి-వీరబల్లి

క్షయ వ్యాధి రోగులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చునని ప్రభుత్వ డాక్టర్ వినయ్ బాబు అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో క్షయ వ్యాధి గ్రస్తులకు కడప లివిన్ డయాగ్నోసిస్ ఎండి గాలివీటి వివేక్ రెడ్డి సహకారంతో పౌష్టికాహార కిట్లు వైసిపి నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి అందచేశారు. మండలంలో క్షయ రోగులకు ఆరు నెలల పాటు పౌష్టికాహార కిట్లు అందచేసి చేయూత నందించడం శుభ పరిణామమని అన్నారు. వైసిపి గాలివీటి వీరనాగిరెడ్డి, నాగూర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. క్షయ రోగులు వ్యాధి సోకిందిని దిగులు పడకుండా ప్రభుత్వం అందిస్తున్న మందులు, పౌష్టికాహారం, వైద్యుల సలహాలు పాటిస్తే వ్యాది నుండి కొలుకోవచ్చని తెలిపారు. విఆర్‌డిఎస్ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి మాట్లాడుతూ క్షయ బాధితులకు అండగా నిలిచి ఆత్మ విశ్వాసం కల్పించేందుకు దాతల సహకారంతో ప్రతి నెల పౌష్టికాహార కిట్ల పంపిణీ తమ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో క్షయ నియంత్రణ అధికారి హరి, తుమ్మల రమేష్, ఆసుపత్రి సిబ్బంది సుబ్బయ్య, ల్యాబ్ టెక్నిషియన్ కల్పన పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పీలేరు

పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో భయాన్ని తొలగిస్తూ అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని యనములవారిపల్లి, కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కార్వేటినగరం డైట్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వై. శ్రీనివాసులురెడ్డి విద్యార్థులను మోటివేట్ చేశారు. పరీక్ష పర్వ్ 4.0 కార్యక్రమాన్ని ఎన్‌పిసిఆర్ సౌజన్యంతో ఎస్‌సిపిసిఆర్, ఎస్‌సిఇఆర్‌టిల సహకారంతో ఈనెల 11వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా 10 పాఠశాలల్లో పది రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పరీక్షలు పూర్తయ్యే వరకు టివి, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. తక్కువ మార్కులు వచ్చే సబ్జెక్టులపై అవగాహన పెంచుకొని ఎక్కువ మార్కులు సాధించడానికి కృషి చేయాలన్నారు. మనం ఎప్పుడూ ఓటమి దగ్గరే ఆగిపోకూడదని, చైతన్యంతో పరిష్కారం వైపుకు పయనించాలను చెప్పారు. మనకు తోటి విద్యార్థులతో పోలిక సరికాదని, ఎవరికి వారు పోటీతత్వంతో చదువుకుంటూ ఎదగాలని హితవు పలికారు. పాఠ్యాంశాల్లోని పాయింట్లు నోట్ చేసుకుని, పరీక్ష రాసే విధానంలో సైడ్ హెడ్డింగ్లు పెట్టడం, ప్రాధాన్యతా అంశాలను ప్రశ్నకు తగ్గ జవాబులు ఇవ్వడంలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఏ సమస్యకూ ఆత్మహత్య పరిష్కారం కాదని, దీనికి ప్రతికూల వైఖరి నిరోధమే మార్గమన్నారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, శివ శంకరయ్య, ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, రెడ్డెప్పరెడ్డి, మస్తాన్ సాహెబ్, వై.రెడ్డెప్పరెడ్డి, శేషాద్రిరెడ్డి, జయచంద్రారెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

ప్రజాశక్తి- బి.కొత్తకోట

ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది చొరవ చూపాలని ఎంపిడిఒ శంకరయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని గట్టు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పకుండా పాటించాలని, సచివాలయానికి వచ్చే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని తెలిపారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయంలోని పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిట్స్‌లో 'తనేగా నా ప్రాణం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కురబలకోట

మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మంజు ప్రీతం ' తనేగా నా ప్రాణం' పుస్తకాన్ని రాసి ప్రచురించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. మదనపల్లె ప్రజా చైతన్య స్రవంతి వారు యువ రచయిత అవార్డును అందజేశారని తెలిపారు. మంజు ప్రీతంను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఇడి కీర్తినాదెళ్ల అభినందనలు తెలిపారు. మంజు ప్రీతం మాట్లాడుతూ ఈ పుస్తకంలో 60 పేజీలలో సుమారు 55 కవితలు జోడించి ఉన్నాయని, పుస్తకం అమెజాన్‌లో అందుబాటులో ఉందని తెలిపారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ సి.యువరాజ్

నేడు ముద్దనూరు మండల సమావేశం

ముద్దనూరు: స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో గురువారం ఉదయం ఎంపిపి ప్రదీప్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయం, పారిశుధ్యం, తాగునీరు, ఉపాధి, వైద్య, విద్య, రోడ్లు, గృహాలు వంటి అంశాలపై చర్చించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..రాచవేటివారిపల్లి పంచాయతీ గొల్లపల్లికు చెందిన శిరసాని వెంకటరమణ(50) మంగళవారం తన పొలం వద్ద వరినాట్లు వేశారన్నారు. సాయంత్రం కావడంతో కొంగలు వచ్చి వరినాట్లను తొక్కుతాయని పొలం వద్దే కాసేపు ఉండి వస్తానని మీరు ఇంటికి వెళ్లండని కుటుంబ సభ్యులకు తెలిపారన్నారు. అనంతరం రాత్రి 7.50 గంటల సమయంలో గ్రామానికి సమీపంలోని రాళ్ళంగాళ్ల చేను దగ్గర చింత చెట్టు కింద వెంకటరమణ అనుమానాస్పద స్థితిలో నిశ్చలంగా పడి ఉండటాన్ని కొందరు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారన్నారు. వెంకటరమణ కుమారుడు మణికంఠ సంఘటన స్థలానికి వచ్చి చూడగా అప్పటికే తన తండ్రి మృతి చెందినట్లుగా గుర్తించారని అన్నారు. తన తండ్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందటంతో అదే గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి, జంగిటి వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, జంగిటి మల్లికార్జున లపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మృతుడి కుమారుడు మణికంఠ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకతాయిల చేష్టలతో మామిడిచెట్లు దగ్ధం

ప్రజాశక్తి-చిన్నమండెం

గుర్తు తెలియని ఆకతాయిల చేష్టలతో మామిడిచెట్లు పూర్తిగా కాలిపోయిన సంఘటన మండలంలోని కొత్తపల్లి పంచాయతీలో చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు మండలంలోని కొత్తపల్లె పంచాయతీ గరుగుపల్లె చెందిన పెద్దవీరయ్య, శకుంతల, శంకర్రెడ్డి, భాస్కర్, సురేంద్రల భూములలో మామిడితోటలు ఉన్నాయని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలిని ఆకతాయిలు నిప్పుపెట్టడంతో మామిడిచెట్లు కాలిపోయాయన్నారు. రైతులు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించడంతో ఫైరింజన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చినట్లు తెలిపారు. మండల ఉద్యానవన శాఖాధికారిణి వనిత జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు పై స్థాయి అధికారులు సమాచారం అందించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కన్నీరు మున్నీరై విలపించారు.

చెరువులో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి పాఠశాల నుంచి స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి నీటి కుంటలో పడి మృత్యువాత పడ్డ ఘటన రాజంపేట పట్టణంలో విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బోయినపల్లి లోని ఎల్లాగడ్డ లో నివాసం ఉంటున్న వెంకటేష్ కుమారుడు చరణ్ తేజ్ (11) బోయినపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం వరకు పాఠశాలలోనే ఉన్న విద్యార్థులు మధ్యాహ్నం తర్వాత పాఠశాలకు దగ్గరలో గల మన్నూరు చెరువులో సరదాగా ఈతకు వెళ్లారు. ఈత కొడుతూ చరణ్ తెజ్ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడ్డాడు. కొన ఊపిరితో ఉన్న బాలుడిని తన తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యులు ఎల్లారెడ్డి బాలుడిని బ్రతికించడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే అప్పటికే సమయం మించి పోవడంతో బాలుడు మృత్యువాత పడ్డాడు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే తన కుమారుడు మృత్యువాత పడ్డాడని బాలుడి తండ్రి వెంకటేష్ ఆరోపిస్తున్నారు. పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు తరచూ మధ్యాహ్నం సమయంలో పాఠశాల నుంచి ఈతకు వెళుతున్నా ఉపాధ్యాయులు పట్టించుకోలేదని., విద్యార్థులు పాఠశాలలో ఉన్నారా లేదా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని, ఈ దుర్ఘటన కేవలం ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.

మృతి చెందిన విద్యార్థి చరణ్ తేజ్

బాలికపై వేధింపు కేసులో యువకుడు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలానికి చెందిన ఓ బాలిక పై వేధింపు కేసులో యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తవళం గ్రామానికి చెందిన బాలికను గంగాపురం పల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు చెంజి ప్రశాంత్ (25) ను తవళం రోడ్డు లోని బుచ్చిరెడ్డిగారి పల్లి బస్‌స్టాప్ వద్ద ముదివేడు ఎస్ఐ సుకుమార్ సిబ్బందితో అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.